
# జవాబు దొరకని ప్రశ్నలు

చంద్రమౌళి విజయలక్ష్మి




“అమ్మయ్య” అనుకున్నాను వాలు కుర్చీలో జారగిలబడుతూ. ఇప్పటికి వారంరోజులుగా ఈ రాజధానిలో వసతిగృహ నివాసార్థం వేటాడి అలసిపోయాను. శ్రీమతిని కొత్తగా తీసుకురావటం; ఆవిడకి నచ్చితే నాకు నచ్చక నాకు నచ్చినది ఆవిడకి నచ్చక, ఇద్దరికి నచ్చినది ఇంటిఅద్దె కుదరక, అద్దెకుదిరితే వసతిలేక విసుగెత్తిపోయాను. ఇక ఇవాళినుంచి హోటల్ వాడికి గుడ్‌బై; ఇంతలోకే పేపర్ కుర్రవాడు బెల్‌కొట్టి ఇవతలమనిషి వచ్చేవరకూ ఆగేవోపిక లేక అక్కడ గిరాటేసి వెళ్ళిపోయాడు. అది ఏరి తెచ్చుకొని “ఫిఫ్టీ... కాఫీ... వాంటెడ్ ప్లీజ్” అని ఇల్లాలి చెవినవేసి గదిలో కొచ్చి పడ్డాను.

అడుగుల చప్పుడుకి తలఎత్తి చూశాను. ఒక చేతిలో కప్పు రెండవచేతిలో ఒక కవరూ పట్టుకొచ్చి.

“ఇందాక గదిలో అన్నీ సర్దుతుంటే ఈ కవరు కనిపించింది. అప్పుడు మీరు లేక పోయేసరికి యథాలాపంగా వంటింట్లోకి తీసుకుపోయాను. ఇప్పుడు గుర్తువచ్చింది” అంటూ సందేహ నివృత్తి చేసింది శ్రీమతి.

ఒక చేత్తో కప్పు అందుకుంటూ రెండవచేత్తో కవరు పై ఎడ్రస్ ఏమిటా అని చూశాను. ఎవరో 'ఎస్. రాజగోపాల్' అని వుంది. ఎవరై ఉంటారా అని తిప్పి చూశాను ఇదివరకు చింపి చదివిందే! అది చదివిన నా మనస్సు వికలమైంది చదివింది చదివినట్టుగా కింద పొందుపరుస్తున్నాను. మీరు కూడా చదవటానికి వీలుగా!

వరంగల్

డియర్ బావా 9-3-64

మన ఇద్దరికి ఇదివరకు పరిచయం ఉన్నా, ఇదే మొదటి సారేమో నీకు ఉత్తరం వ్రాయటం. ఇదే చివరి సారి కూడా నేమో! ఈ విధంగా రాయవలసి వస్తుందనుకోలేదు బావా! నా పేరు చూడటం తోనే అసహ్యించుకోకుండా దయచేసి ఓపికతో చదువు బావా!

నేను పుట్టినప్పుడు అత్తయ్య ఎంతో సంతోషించిందట! తనకు కోడలు పుట్టిందని మురిసిపోయిందిట, తన స్తోమతకు. తన స్థితికి తగినట్టుగా ఆడంబరంగా అన్ని వేడుకలు జరిపించిందట. నేను పెద్దదాన్ని అవుతున్నప్పుడు అమ్మ చెబుతూండేది. నాకు బాగా గుర్తు నన్ను 1st formలో చేర్పించటానికి బామ్మ ససేమిరా ఒప్పుకోలేదు. తనకి ఇష్టంలేని పనిచేస్తే బావిలో దూకి చస్తానని బెదిరించింది. ఇంటా వంటా లేని ఇలాంటి అప్రతిష్ఠ పనులు తన మనుమరాలిచేత చేయించటానికి తను ఇంకా బ్రతికే ఉన్నానని బెదిరించింది. నాన్నకి నాకు చదువు చెప్పించాలని మనసులో ఉండటంచేత అత్తయ్యకు ఉత్తరం వ్రాశారు. అత్తయ్య రెక్కలు కట్టుకుని వాలింది. అత్తయ్య రావటమేతడవుగా గాలివాన ప్రారంభమయింది మా ఇంట్లో.

# జవాబు దొరకని ప్రశ్నలు

"అది నాకోడలు. నాయిష్టం వచ్చినట్టు చదివించుకొంటా! నీ మనుమరాలిని నా కొడుక్కి ఇవ్వాలని, వాళ్ళిద్దరిపెళ్ళి నీ కళ్ళారా చూడాలని నీ కుంటే నీ పంతం విడు! ఇది మీ కాలంగాదు. చాలా మారింది! ప్రస్తుతం ఈ వూళ్ళో ఉన్నంత వరకు చెప్పించండి. తరువాతసంగతి నే చూసుకుంటాను!" అని గట్టిగా చెప్పినా బామ్మ తన పంతం విడవలేదు.

"నీ కొడుకు కాకపోతే ఇంకోడు! నా బంగారు తల్లికి ఇంతోటివరుడు దొరక్కపోడు! దేశమేమి గొడ్డుపోలేదు!" అంది బామ్మ.

ఇక లాభంలేదని అత్తయ్య.

"ఇక నేనీ గుమ్మం తొక్కను! నీకు కూతురు లేదనుకో: పుట్టిన కూతురు చచ్చిందనుకో!" అని చివరిఅస్త్రం ప్రయోగించి, నెత్తిమీద కుండ బిల్లా పెట్టుకునేసరికి బామ్మ కంగారుగా.

"అయ్యో! అయ్యో! ఇప్పుడే మయిందనే! పరేకానీ! నీ యిష్టం వచ్చినట్టే చెప్పించుకో! పెద్దలమాటలు వినే కాలమా ఇదీ! నా వెర్రికొద్దీ నే నేదో అనుకున్నాను. ఆపైబడుదువు! ఇంటికి వచ్చి కన్నీళ్ళు పెట్టకమ్మా!" అని సర్దిచెప్పి, గొణుగుతూనే ఒప్పు కొన్నది.


అప్పట్లో మే మొక వల్లటూళ్ళో ఉండే వాళ్ళంగా! అలా ప్రారంభమయింది. నా స్కూల్ చదువు. శలవుల్లో నువు మా వూరు వస్తుండే వాడివి. నే వింకా చిన్నపిల్ల నవటంచేత, అమ్మకి, బామ్మకి నన్ను వదిలి ఉండాలంటే దిగులుగా ఉండి నన్ను హైదరాబాద్ పంపలేదు. మా వూరు. నువు వచ్చిన రోజులు మరపురానివి బావా! ఎప్పుడూ అనిపిస్తుంది. ఈభగవంతుడు పుట్టించిన పసి పిల్లల్ని ఎదగనీకుండా అట్లాగే ఉంచేస్తే ఎంత బాగుండును! అని చిన్నప్పటినుంచి నీకు తొందర, అహంభావం, కోపం, ఎక్కువ. నేను నీ భార్యనని చిన్నప్పటినుంచే అనేక పనులు పురమాయిస్తూ, హుందాగా కూర్చునేవాడివి నేను చేయకపోతే నాలుగుమొట్టికాయలు మొట్టేవాడివి. అందుకని నువ్వంటే నాకు చచ్చే హడల్. చిన్నప్పటినుంచి నువ్వు ఏ పని చెప్పినా కిక్కురు మనకుండా చేసేదానిని. ఎక్కడ తంతావో అని! చిన్నప్పుడు ఆటలాడుకొనేటప్పుడు కూడా నువ్వు నాన్నగా, అమ్మగా ఉండి తీరాలనే వాడివి. నేను నీకు భయపడి ఉండనంటే నా జడ పట్టుకొని ఈడ్చుకొచ్చేవాడివి! ఏడుస్తూ అయినా సరే ఆడి తీరవలసిందే! ఇహ కిక్కురు మనటానికి కూడా దమ్ములుండేవి కాదు నాకు! ఎంత నీకు కోపం అహంకారం అయినా దానిలోనే అభిమానం, గాంభీర్యంతోకూడిన ఆప్యాయత ఉన్నాయి! అందుకే బావా! నువ్వంటే నాకు అంత ఇష్టం!

ఒకసారి ఏం జరిగిందో నీకు గుర్తున్నదా? నా పిచ్చిగానీ నీకేం జ్ఞాపకం ఉంటుంది లే బావా! ఆరోజు నువ్వు మిట్ట మధ్యాహ్నం నీతోడి పిల్లలతో "గోలీలు" ఆడుతుంటే బామ్మ లోపలినుంచి అరచింది.

"మిట్ట మధ్యాహ్నం ఏ మాటలే! వాడ్ని లోపలికిరమ్మని పడుకోమను!" అని.

నీతో చెప్పటానికి భయంవేసి నువ్వు కొట్టిన గోలీ తీసుకొని పరిగెత్తాను. దాంతో నీకు వళ్ళు మండి నువు నా వెంట పడ్డావు. పరిగెత్తి, పరిగెత్తి మనతోటంతా పరిగెత్తి, చివరికి "సీమ తుమ్మ" చెట్లదగ్గరికి వచ్చాము. నువు వెనకాల తరుముకొస్తున్నావు. నాకు ముందు చోటులేదు. వెనక్కిచూస్తూ ముందుకి పరిగెత్తేసరికి అక్కడ ఒకరాయితగిలి ముందుకి బోర్లా పడిపోయాను. కిందఅంతా ముళ్ళు. అంతా గుచ్చుకొని తెగరక్తం కారింది. నువు గబగబా పరిగెత్తి తడిగుడ్డ, పీట తెచ్చి అంతాఅద్ది, ముళ్ళన్నీ ఎంతో ఓపికతో తీశావు.

"నా వల్లనే నీ కిలా జరిగింది రాధీ!" అని బోరున ఏడ్చావు నాకు బలే వింత అనిపించింది. నీకు కూడా కళ్ళవెంట నీళ్ల వస్తాయంటే! మరచి పోయా బావా! నీకు తగినపేరు. నా కుండాలని అత్తయ్యేకోరి నాకీపేరు పెట్టిందిట? అత్తయ్య కెలా తెలుస్తుంది? తన ఆశలన్నీ పేక మేడలని! అప్పటినుంచి నువ్వంటే క్రమ క్రమంగా భయం పోసాగింది. పై పెచ్చు నువ్వంటే చనువు, అభిమానం ఏర్పడ్డాయి. తరువాత నువ్వు వెళ్ళిపోయావు. క్రమంగా నాలుగైదేండ్లు గడిచాక బామ్మ పట్టు పట్టింది నా పెళ్ళి తన కళ్ళతో చూడాలని. అప్పుడు నువ్వు P. U. C. చదువుతున్నావు. మామయ్యకి అసలది ఇష్టంలేదు. అందుకే "ఇప్పుడే ఏం పెళ్ళి" అని ఒప్పుకోలేదు. అలాగని "నా కిష్టం లేదీ పెళ్ళి మేం చేసుకోము" అని చెప్పలేదు. బహుశా అత్తయ్యకి భయపడ్డాడేమో! తరువాత సంవత్సరమే బామ్మ చనిపోయింది. బామ్మ జ్ఞాపకాలతో ఆ వూరిలో ఉండలేక కొంతా, నాకు చదువుకు వీలని కొంత అన్నిటికిమించి నాన్న స్నేహితుడు వరంగల్‌లో బట్టల వ్యాపారం మొదలుబెట్టి దానిలో పార్ట్నర్‌గా చేరమని ఒత్తిడి చేయటంతో నాన్న అక్కడ మా కున్న ఆస్తినంతా అమ్మేసి వరంగల్ వచ్చి స్థిరపడ్డాము. తరువాత నాన్న అనుకొంటూండేవారు. ఉన్న ఆస్తి నమ్మకోవటమంత తెలివితక్కువ మరొకటి లేదని? నాన్నవల్ల బాగ లాభం వస్తూండటంచూసి నాన్న స్నేహితుడికి కన్నుకుట్టింది. మెల్లగా నాన్నని మోసంచేసి పెట్టుబడి పెట్టినదానిలో నాలుగవవంతు ముట్టచెప్పి ఆ వూరువదలి వెళ్ళిపోయాడు. అప్పటికి నేను స్కూల్ ఫైనల్ పాస్ అయి ఉన్నాను. ఇంకొద్ది నెలలలో కాలేజ్‌లో జాయిన్ అవుదా మనుకొన్నాను. అప్పుడు నువు బి. ఇ. చదువుతున్నావు అనంతపూర్‌లో! అప్పుడు మళ్ళీ మన పెళ్ళి విషయం కదిపి ఎలాగోలా నా పెళ్ళిచేసి వాళ్ళు ఎలాగోలా బ్రతుకుదామనుకొన్నారు. మనం అనుకొన్నది అనుకున్నట్లు చేస్తే ఇక తననెవ్వరు గుర్తించరని భయపడ్డాడేమో ఆ భగవంతుడు! నాన్న హైదరాబాద్ వెళ్ళారు. అదే సమయంలో అత్తయ్యకు జబ్బుచేసి చావు బ్రతుకులమధ్య ఉన్నది. జబ్బుగా ఉందని కనీసం ఒక్క కార్డుముక్క అయినా రాయలేదని నాన్న మండిపడ్డారు మామయ్యమీద. ఆ పరిస్థితిలో కదల్చటం ఇష్టంలేక నాన్న మాట్లాడలేదుట, కాని చివరి ఘడియల్లో అత్తయ్యే మామయ్యతో "రాధని మన కోడలుగా చేసుకొండి వాడి చదువు అవటంతోనే" అని చెప్పిందిట. మామయ్య మాట్లాడలేదుట. కాని అప్పటి మామయ్య మౌనానికి అర్థం ఇప్పుడు నాన్నకు తెలిసింది! నాన్న తన తప్పుని తెలుసుకొని మళ్ళీ



లేనిపూనపెళ్ళి ఉన్న కొద్దిపాటి డబ్బుతో ఆ వూళ్ళోనే కొంచెం పొలం, చిన్న ఇల్లుకొని నెమ్మదిగా నెట్టుకొస్తున్నారు. నా చదువుమాత్రం యథావిధిగానే సాగింది. అత్తయ్య కోరికమీద. నువ్వంటే ఇదివరకు ఏర్పడిన అభిమానం రోజు రోజుకూ పెరుగుతూ వచ్చింది. ఇప్పుడనుకుంటు న్నాను. బహుశా అది 'ప్రేమ' అంటారేమో. ఈ కారణంబట్టే ఎప్పటికైనా నువ్వు నావాడివేనను కొంటూ ఉండేదాన్ని. పొరపాటునకూడా మరొక వూహ వచ్చేదికాదు. అసలు రానిచ్చే దాన్ని కాదు. మనసు మనం చెప్పినమాట వినదు కదా! అటూ, ఇటూ, పరుగులు పెడుతూ ఉంటుంది. అలాంటి సమయంలో తమాషాకైనా నీప్రక్కన మరొక వ్యక్తిని వూహించుకొందుకు నాకు స్త్రీహృదయం సహించేదికాదు. స్త్రీసహజమైన అసూయాద్వేషాలే నాలోనూ ప్రబలియుండేవి. నువ్వు నన్ను అలా మోసగించవనుకొనేదాన్ని. నాఅంత అదృష్టవంతు రాలు లేదని మురిసిపోయాను. తరవాత సెలవలకి మా వూరువెళ్ళినా నీగురించేమీ నాకు తెలిసేదికాదు. అమ్మ ఏమన్నా చెబుతుందేమోనని ఆశిస్తూ వచ్చే నేను నిరాశతోనే రైలెక్కేదాన్ని.

ఇలా ఉండగా ఒక నెలరోజుల క్రితం నాన్న నుంచి ఉత్తరం వచ్చింది. వెంటనే రమ్మని ఏమిటో అనుకొని వెళ్ళాను. ఆ రాత్రి అమ్మ చెప్పింది, మర్నాడు నన్నెవరో చూడటానికి వస్తున్నారని. నాగుండె దడదడలాడింది. నేను వింటున్నదేమిటో అర్థంకాలేదు. అసలు నాకేనా చెబుతున్నది! అని అనుమానం వచ్చి మళ్ళీ అడిగాను.


"ఏమిటమ్మా నువ్వు అంటున్నది" అని అన్నాను.

"అవునమ్మా అబ్బాయిది నెల్లూరు. B. A. పాస్ అయి ఏదో ఆఫీసులో గుమస్తాగా ఉంటు న్నారు. తల్లి దండ్రి లేరు. ఇద్దరు అన్నలు మాత్రం పేరుకు వున్నా ఇతని సంగతి పట్టించుకోరు ఇద్దరికీ పెళ్ళిళ్ళయి ఎవరి సంసారాలు వాళ్ళు చేసుకుంటున్నారు. నువ్వుకూడా ఉద్యోగం చేసుకుంటే దేనికీ కొరతఉండదు..." అని ఏదో చెప్పబోయింది.

"అది సరేనే; నాకు విడిగా సంబంధం చూడ్డం ఏమిటి? బావ అని ఎప్పటినుంచో అనుకుంటూ ఇప్పుడిలా హఠాత్తుగా ఎందుకనుకున్నారు?" అని అడిగాను సిగ్గువిడిచి.

"మనకలాంటి సంబంధం వద్దమ్మా! ఇన్నాళ్ళ నుంచి వాళ్ళు చేసుకుంటారనే ఆశతో మోస పోయాము. మనదే తప్పు! వారి అంతస్తు చూడకుండా ఆశలు పెంచుకోవటం! ఇదివరకటి సంగతి ఏమయినా మీనాన్న వ్యాపారంలో దివాలా తీసిన తరువాతనైనా తెలుసుకోవల్సింది" అంది అమ్మ.

"అది సరేనే! అసలేమయింది? మీరు వాళ్ళ




నడిగారా? అని అడిగాను ఏం వినాల్సి వస్తుందో అనుకొంటూనే!

"ఆ అడగటం, వాళ్ళచేత లేకిపించుకోవటం, మాటలనిపించుకోవటం అన్నీ అయి నాయి" అంది.

"ఏమన్నారు' బావనడిగారా? బావ అలా అన డమ్మా! మీరు పొరబడ్డారేమో." అని అడిగాను ఆత్రంగా.

"హుఁ! ఇష్టంలేదు మీ అమ్మాయిని చేసు కోవటం అని చెప్పిందేమి బావమ్మా! మీ మామయ్య ఏమన్నారో తెలుసా! మావాడి విలువ తెలిసే ఈ మాట అంటున్నారా! మావాడి ఇప్పటి కనీసపు రేటు 15 వేలు! అది ఇచ్చుకో గలిగితే నా కభ్యంతరంలేదు" అన్నారుట అయినా మీ నాన్న ఆ! చంపుకోలేక.

"మా పరిస్థితి చూసి మాట్లాడు బావా! మాకైనా ఎవరున్నారు అది ఒక్కర్తేకదా! మీ చెల్లెలి నగలు. కాస్తోకూస్తో ఉన్నపొలం అమ్మి మొత్తం 5 వేలు ఇచ్చి మా శక్తికి తగినట్లు పెళ్ళి చేస్తాము. మొదటినుంచి అనుకుంటున్నది ఇప్పుడు కాదనకు బావా!" అని చేతులు పట్టుకున్నారుట.

చేతులు విదిలించి "మరి మిగతా 10 వేల మాట ఏమిటి?" అన్నారుట వ్యంగ్యంగా.

కనీసం నీతో చెబితేనయినా నువ్వు అయినా మామయ్యతో చెబుతావనే ఆశతో నీదగ్గిరకొచ్చారుట బావా, నాన్న.

అప్పుడు నువ్వేమన్నావో గుర్తుందిక పోవచ్చు! అది నీకు వినోదంగానే ఉండి ఉంటుంది చెబుతా విను.

"ఏమిటి మామయ్యా! నాన చెప్పారు గదా! ఆయన అభిప్రాయమే నాదికూడా, ఇంకా నువ్వు నాకు చెప్పేదిలేదు. నేను వినాల్సిందిలేదు. మీ అమ్మాయికేమున్నా అందమా! చదువా! నల్లగా ఉంటుంది! ఎప్పుడు చూసినా ఉసూరు మంటూనే ఉంటుంది? ఒక చలాకీతనంలేదు చటుబంతలు లేదు. పోనీ చదువైనా ఉందా అంటే B.A.! తోడి B.A. ఇప్పుడెవరిని కదిలించినా 'నేను B.A.' అంటున్న ఈకాలంలో మీఅమ్మాయి చదివింది ఒక చదువేనా! అదైనా కో-ఎడ్యుకేషన్! ఇక మీఅమ్మాయి కారెక్టర్ మీద నమ్మకం ఏమిటి? అదిగో! ఫలానా ఆఫీసరు గారిభార్య ఆవిడే అంటే అబ్బ! అలాగా అనేట్టుండాలిగాని "ఓస్ ఈవిడా!" అని చప్పరించే ట్టుంటే ఎలా!" అని ఒక చిన్న లెక్చర్ ఇచ్చావుట.

ఏ స్త్రీనైనా 'నువ్వు అంతటిదానివి ఇంతటి దానివి" అంటే పొంగిపోతుంది "నువ్వు చెడ్డ దానివి, నువ్వు అందవిహీనురాలివి' అంటే కృంగి పోతుంది! అదే నా విషయంలోను జరిగింది. ఎంతో కృంగిపోయాను. చాలా ఆశ్చర్యంకూడా వేసింది నామీద నీకున్న ఈ నీచమైన అభిప్రాయా నికి. నేనా నాడు ఎంత రంపపుకోత అనుభవించానో నీకు తెలియదు బావా! ఇప్పటికి ఆ మాటలు గుర్తువస్తే ... హుఁ! రాని రోజేదిబావా! నాగుండెనెవరో పిండుతున్నట్టు ఫీలవుతాను. ఏ అంతటి అందం. చదువు డబ్బు నాకుండకపోవచ్చు! కాని బావా! ఇది మాత్రం నూటికి నూరుపాళ్ళు నిజం! నీకంటే ఉత్తమ మైన, విశాలమైన మనస్సు నాకుంది. నీకంటె ఉత్తమమైన సంస్కారం నాకుంది. నువ్వు ఇంజ నీరువి! రాళ్ళలో ఇనుపముక్కలలో పనిచేసి రాటుదేలిపోయావు. నువ్వు ఒకరాయిగా తయా రయ్యావు. కానీ బావా! నాకున్నది ఒక్కటే మనస్సు! ఇంత జరిగినా నీమీద నాకసహ్యం

# జవాబు దొరకని ప్రశ్నలు

వేయటంలేదు. మొదట ఎలాంటి అభిప్రాయం ఉన్నదో ఇప్పుడూ అదే ఉన్నది. అందుకే ఆ రోజే అమ్మతో చెప్పేశాను.

"నాకు మొదటినుంచి బావంటే ఇష్టం. మీరు కూడా అతన్ని ఆ దృష్టితోనే చూశారు. వాళ్ళకు కావలసినంత డబ్బు ఇచ్చుకోలేనందువల్ల దూర మయ్యాను. ఇంక ఇప్పట్లో నాకేమీ పెళ్ళి వద్దు దయచేసి ఇలా ఉండిపోనీమ్మా" అని

అమ్మ ఇంకా ఏదో నచ్చచెప్పబోయింది. నేను ఒకటే అడిగాను అమ్మని. "నువ్వు మజ్జిగ లోంచి వెన్న ఎన్నిసార్లు తీస్తావమ్మా?" అని.

"అదేమిటే!" అంటూ అమ్మ తెల్లబోయి చూసింది. మరేమీ మాట్లాడకుండా వచ్చేశాను.

ఆ మర్నాడు అమ్మ ఎంత మొత్తుకున్నా విన కుండా పొద్దునే రైలెక్కాను. ఆ తరువాత వచ్చిన పెళ్ళివాళ్ళకి ఏదో వీలుపడలేదని సర్ది చెప్పి పంపేశారుట. కాని బావా నీ పూర్తి స్వరూపం మొన్న తెలిసింది. మొన్నంటే ఒక పదిహేను రోజుల క్రితం. నీకు అది తెలియదు. తెలిస్తే నీ ముఖభావాలు... కాదు... కాదు నీ ముఖంలో ఎన్నిరంగులు మారతాయో చూడటానికి నాకు వీలుపడదు. అదేమిటో చెబుతాను విను.

ఒక పదిహేనురోజుల క్రితం నువ్వు, మామయ్య, ఒక పెద్దమనిషి వరంగల్ వచ్చారు పెళ్ళిచూపులకు. నువ్వు చూసింది నా ఫ్రెండ్‌ని బావా! తను అంతకు ముందురోజు నా దగ్గరకు వచ్చి తన్ను మర్నాడు చూడ్డానికి ఎవరో హైదరాబాద్‌నుంచి వస్తున్నారని, అతను బి. యి. చదివాడని ఎంతో మురిసిపోతూ చెప్పింది. నాకు నువ్వేమోనన్న ఊహ్యేన్నీ కలిగినా ఆ విధంగా ఊహించుకోలేకపోయాను. చెప్పానుగా ముందరే! సరే నన్ను మరీ మరీ రమ్మని ఒట్టు వేసి చెప్పి వెళ్ళింది. ఇక బాగుండదని, ఒకవేళ నువ్వే అయితే కనీసం ఒకసారి చూసినట్టైనా చూడవచ్చునని ఆశతోనే వచ్చా బావా నిజంగా! నేను, మధూ .. అదే మాధవి పైనకూర్చున్నాం కారు చప్పుడికి అనుకోకుండా కిందకు చూశాను. నా కళ్ళు బైర్లుకమ్మాయి. నా ఊహ నిజమయింది. ఫుల్‌సూట్‌లో ఉండి టక్ చేసిన నిన్ను చూడగానే నా గుండె ఝల్లుమంది. మధూ, మధు తల్లి ఎంత బతిమలాడినా నేను క్రిందకు దిగిరాలేదు. తర్వాత మీరు వెళ్ళాక తలనొప్పిగా ఉందని వచ్చేశాను. ఆ తరువాత మాధవి వచ్చి చెప్పింది. సిగ్గుపడుతూ తను నీకు నచ్చిందని ఒక పది హేను రోజులకు వచ్చి లగ్నాలు పెట్టుకుంటారని. కానీ బావా! నువ్వు నాకు ప్రసాదించిన బిరుదులే తనకి ఇస్తావేమో నాకంటే తను... అహ కాదు పోనీ తనకి నేను దేంట్లో తీసిపోయాను తను నలుపే తనది కో- ఎడ్యుకేషనే! తను చదివింది బి. ఏ. నే అహ కాదు...బోడి బి. ఏ. మరి తన కారెక్టర్ గురించి నమ్మకమేమిటి? సరే నాకవన్నీ అనవసరం కానీ బావా! ఒక్కటి మాత్రం నిజం! ఈ కాలంలో డబ్బంటే అన్ని అవకరాలు కొట్టుకుపోతాయి. అవును మరి లక్షరూపాయలఆస్తికి తను వక్కతే వారసురాలు తను నీకు ఇచ్చే కట్నం డబ్బు 20 వేలు!! నాకు డబ్బు లేకపోవటం నా తప్పా బావా! నాన్న బిజి నెస్‌లో దివాళ తీయటానికి నేను బాధ్యురాలనా? కానీ మరొకటి బావా! నువ్వు సందేహించినట్టుగానే అయింది. కాలు ఎత్తి ఎత్తి వేస్తే ఎంగిలాకుమీద పడు తుంది! అలాగే అయింది నేను కూడా! ఒక కష్టమైన నిజం ఉన్నది. నేను ఈ తరుణంలో ఈ విషయం చెప్పకుండా ఉందామన్నా నువ్వు నా ప్రాణానికి ప్రాణం! అలాంటి నీకు అన్యాయం జరుగు తుంటే చూస్తూ ఊరుకోలేకపోయాను. అందుకే చెబుతున్నాను. మాధవి వారంరోజుల క్రితం అబార్షన్ చేయించుకొన్నది. ఇది మూడవసారి. ఇక సంతాన యోగంలేదని డాక్టరు చెప్పిందిట. ఆ 20 వేల ముందు ఇది నీకు లోపంగా కను పించక పోవచ్చు. ఇప్పటికే చాలా వ్రాసి విసి గించానేమో! ఇంకొక రెండుమాటలుచెప్పి ముగి స్తాను. కాస్త ఓపికగా చదువు బావా నకోసం! ఇది చదివి నామీద జాలితో ఒక నిట్టూర్పైనా విడు! నా ఆఖరి ఘడియల్లో తెలుస్తుంది కదా! ఒక్క సారివచ్చి రెండు కన్నీటిబొట్లు విడువు దీని కంతటికి సమాధానం వ్రాయకపోయినా నా యీ ఒక్క ప్రశ్నకి సమాధానం వ్రాయి బావా! నేనంటే నీకు ఇష్టంఉండికదూ! రిబ్బే ఇన్నిలా చేసిందికదూ! నేనంటే నీ కిష్టమేనని ఒక చిన్ని మాట వ్రాయి బావా! చాలు! జీవించి నన్నాళ్లు తృప్తిగా జీవిస్తా! ఇక మీ పెళ్ళికి రానేమో! రాలే నసలు! ఎందుకంటే వస్తే మీ ఇద్దరినీ చూసి సహించలేను ఇక ఉండినా!

నీకు కాకుండాపోయిన అభాగ్యురాలు.

"రాధ"

* * *

ఎంతసేపయిందో తెలియదు. శ్రీమతి చల్లని చేతులు నా బుగ్గలమీద పడేసరికి తడబడుతూ తలెత్తి చూశాను.

"ఏమిటండీ! ఏమయింది? ఆ ఉత్తరం ఎవరిది? ఏం వుంది దాంట్లో? ఎందుకేడుస్తు న్నారు? అసలేం జరిగింది చెప్పండి. అదేమిటి? కళ్ళు అలా తేలవేస్తున్నారు! భయంతో చచ్చి పోతున్నానండి! ఏమిటది చెప్పండి!" కంగా రుగా, ఆత్రంగా భయంగా అడుగుతోంది శ్రీమతి.

ఉత్తరం ఆమె చేతిలో పెట్టి చదవమన్నాను. "ఇచ్చిన కాఫీ అలా పట్టుకొనే చదివారు." అది కాస్తా చల్లారిపోయింది. మళ్ళీ పట్టుకొస్తాన"ని లోపలకు వెళ్ళింది.

నాకిదేమీ పట్టడంలేదు. ఆ వుత్తరం గురించే ఆలోచిస్తున్నాను రాజగోపాల్ ఎక్కడవున్నా కని పిస్తే ఢామడా నాలుగు మొహాన దులిపేయా లనంత కోపం కలుగుతోంది. అసలా ఎలా ప్రవర్తించాడు? అతనా మాధవిని వివాహమాడే వుంటాడా? ఎంతడబ్బు మోజు అయినా అలాంటి దాన్ని ఎవడు మాత్రం చూస్తూ చేసుకొంటాడు వాళ్ళు మొదటినుంచి హైదరాబాద్‌లోనే ఉంటే ఇప్పుడెక్కడికి వెళ్ళినట్లు? ఈవుత్తరం ఇక్కడి కెందుకు వచ్చినట్టు? ఒకవేళ ఈ ఇంటివాళ్ళే నేమో! అహఁ కాదు. వీళ్ళుకూడా ఈఇల్లు కొత్తగా కొన్నారుట. ఈ ఇల్లుగలవాళ్ళు ఎక్కడో ఇంకొక కొత్త ఇల్లు కొన్నారని చెప్పినట్టుగుర్తే. ఒకవేళ వాళ్ళేఈఇల్లు వీళ్ళకి అమ్మారను కొంటే ఈ వుత్తరం ఇక్కడ పడేసి వెళ్ళే ఆ రాజ గోపాల్ నిర్లక్ష్యం వ్యక్తమౌతోంది. నాకా క్షణంలో ఎవరో ఒకరిని తీసుకొచ్చి నాముందు కూర్చోబెట్టుకుని ఈ ప్రశ్నల కన్నిం టికి సమాధానం చెప్పించుకొంటే బాగుండునని పించింది. ●

